క్లుప్తంగా

ఉపాధి పనులు కల్పించకపోతే చర్యలు

సి.బెళగల్: ఉపాధి కూలీలకు అవసరమైన పనులు కల్పించకపోతే చర్యలు తప్పవని ఉపాధిహామీ ఏపీడీ అల్లిపీర మండల అధికారులను, ఉపాధిహామీ సిబ్బందిని హెచ్చరించా రు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ అధికారులు, టీఏలు, ఎఫ్ఏలు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. పంచాయతీల వారీగా పనుల వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి ఉపాధి పనులకు కూలీల సంఖ్య పెంచేలన్నారు. సమావేశంలో జేఈ రంగస్వా మి, టీఏలు మురళి, రామ్మోహన్, గోవర్ధన్, రాజశేఖర్, ఉమా, ఎంసీఓలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతి



చనుగొండ్ల ప్రతాప్‌రెడ్డి (ఫైల్)

కోడుమూరు రూరల్: గూడూరు మండలంలోని చనుగొండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రతాప్‌రెడ్డి (56) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం వెంకన్న దర్శనార్థం స్నేహితులతో కలిసి తిరుపతికి వెళ్లిన ఆయన అక్కడ స్వామి దర్శనమనంతరం గదిలో నిద్రించగా, నిద్రలోనే గుండెపోటు రావడంతో చనిపోయారు. బుధవారం ఉదయం స్నేహితులు గుర్తించి విషయాన్ని వారు కుటుంబ సభ్యులకు తెలియజేసి ఆయన భౌతికాయాన్ని స్వగ్రామమైన చనుగొండ్లకు తరలించారు. కాగా ప్రతాప్‌రెడ్డి భార్య సునీత గూడూరు ఎంపీపీగా వ్యవహరిస్తున్నారు. ఆయన మృతి పట్ల కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నేతలు సంతాపం వ్యక్తం చేశారు.

గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

సి.బెళగల్: గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల హౌసింగ్ ఏఈ సుమంత్‌తో కలిసి గ్రామ సచివాలయాల ఇంజినీర్ అసిస్టెంట్లతో కలిసి సమావేశాన్ని నిర్వహించారు. గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇంకుడు గుంతల ఏర్పాటు, వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకునేలా చూడాలన్నారు.

రోడ్లను బాగు చేయండి



పెద్దపాడులో దెబ్బతిన్న రోడ్డును చూపిస్తున్న సీపీఎం నాయకులు

కల్లూరు: అర్బన్ కాలనీలో శిథిలావస్థకు చేరిన రహదారులను అధికారులు వెంటనే బాగు చేయాలని సీపీఎం న్యూసిటీ కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. బుధవారం 36వ వార్డు పరిధిలోని పెద్దపాడులో సీపీఎం ప్రజా చైతన్య యాత్ర కార్యక్రమం ద్వారా గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు రాముడు మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు నిర్మించాలన్నారు. ఆక్రమణకు గురైన వర్లోని వంక స్థలాన్ని కాపాడాలన్నారు. వంకకు ఇరువైపులా ప్రహరీ నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపినాథ్, శీను, యేసురాజు, మద్దిలేటి, నాగరాజు, కృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై అభిప్రాయ సేకరణ

కర్నూలు (టౌన్): నగరంలో రోజువారీ స్వచ్ఛత పనులపై ప్రజలు తమ అభిప్రాయాలు వ్యక్తం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా ఏటా నగరాల్లో, పట్టణాల్లో పారిశుద్ధ్య స్థితిగతులను పరిశీలించి ర్యాంకులు ప్రకటిస్తుందని వివరించారు. కర్నూలు నగరం 221 ర్యాంకు నుంచి గతేడాది 32వ ర్యాంకుకు చేరుకుందని తెలిపారు. ఈ ఏడాది సింగిల్ డిజిట్ ర్యాంకు సాధించాలనే సంకల్పానికి నగరంలోని ప్రతి పౌరుడు సహకరించాలని కోరారు. ఇందుకోసం స్వచ్ఛ సర్వేక్షణ్ వెబ్‌సైట్ httpr://sbmurban.org/feedback ను ఓపెన్ చేసి స్వచ్ఛతకు సంబంధించిన పది ప్రశ్నలకు జవాబులు ఇవ్వాలని కమిషనర్ తెలిపారు. కర్నూలు నగరాన్ని జాతీయ స్థాయిలో అగ్రగామిగా నిలబెట్టేందుకు ప్రతి పౌరుడు ఫీడ్‌బ్యాక్ నమోదు చేయాలని కోరారు.

మాతృభాషను కాపాడాలి

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్‌లో తెలుగు సబ్జెక్టును ఐచ్ఛికంగా మార్చేందుకు చేస్తున్న చర్యలు నిలిపివేయాలని ఆంధ్రప్రదేశ్ తెలుగు అధ్యాపకులు బుధవారం ఇంటర్ స్పాట్ క్యాంపు ఆఫీసర్ గురువయ్య శెట్టికి వినతి పత్రం అందజేశారు. ఇంటర్‌లో తెలుగు సబ్జెక్టు కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. తెలుగు సబ్జెక్టును ఐచ్ఛికం చేయడమంటే తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని దెబ్బకొట్టడమేనని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

దాతలను బురిడీ కొట్టిస్తూ..

- ఆలయాల నిర్మాణాలు, అన్నదానం పేరుతో విరాళాల సేకరణ
- సామాజిక మాధ్యమాల్లో పేర్లు మార్చుకుని రెడ్లగా అవతారం
- పోలీసులకు పట్టుబడిన సోమాపురం గ్రామానికి చెందిన వ్యక్తులు

గడివేముల: ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో భక్తుల కోసం వసతి గృహాలు, అన్నదానం చేస్తున్నామని విరాళాల సేకరణ పేరుతో కొన్ని ముఠాలు దాతలను బురిడీ కొట్టిస్తూ రూ. లక్షలు కొల్లగొడుతున్నాయి. జల్సాలకు అలవాటు పడిన గడివేముల, వెలుగోడు మండలాలకు చెందిన కొంతమంది ముఠాగా ఏర్పడి తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో సైతం విరాళాల సేకరణ అంటూ జేబులు నింపుకుంటున్నారు. ఆలయాలు నిర్మిస్తున్నామని ఎక్కడివో ఫొటోలు సేకరించి వాటిని దాతలకు చూపిస్తూ వసూళ్లు చేస్తున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. మూడు రోజుల క్రితం రాజమండ్రి పోలీసులకు పట్టుబడిన ముఠాల్లో మండల పరిధిలోని సోమాపురం గ్రామానికి చెందిన కొంతమంది ఉన్నారు. గతంలో రాష్ట్రంలోని వివిధ పోలీస్ స్టేషన్లలో పరిధిలో వీరు పట్టుబడినా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంతో వారి దందాకు అడ్డు లేకుండా పోతోంది. సోమాపురం గ్రామానికి చెందిన పెద్దన్న, శంకర్, పెద్ద రమణయ్య, విజయ్‌లు రాజమండ్రిలో పట్టుబడిన విషయం తెలిసిందే. వీరు గ్రామం నుంచి ఖరీదైన కార్లలో వెళ్లి పది, ఇరవై రోజుల పాటు ఆయా ప్రాంతాల్లో రెడ్లమని చెప్పి అక్రమ వసూళ్లకు పాల్పడి సొంత గ్రామానికి తిరిగి వస్తున్నట్లు తెలిసింది. వీరితో పాటు చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన కొందరిని కూలీలుగా పిలుచుకుని వెళ్తున్నారు. ఇక్కడి నుంచి బయలు దేరే సమయంలో వారి పేర్లను ఏ గ్రామమైతే ఆ గ్రామానికి చెందిన ప్రముఖ రెడ్డి పేరుగా మార్చుతారు. వారికి రోజుకు రూ.1,500 నుంచి 2 వేల దాకా ఇస్తున్నారంటే దందా ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

వృద్ధాశ్రమం పేరుతో డబ్బు వసూలు...

గడివేములకు చెందిన ఓ వ్యక్తి హైదరాబాదులో శివారులో వృద్ధాశ్రమం పేరుతో డబ్బులు వసూలు చేస్తూ పట్టుబడిన ఘటన రెండు రోజులుగా సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గడివేముల గ్రామంలోని బీసీ కాలనీకి చెందిన ఓ వ్యక్తి హైదరాబాదులో మల్కాజ్ గిరి జిల్లాలో ఆదర్శ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ పేరుతో ఓల్డ్ ఏజ్ హోమ్ నడుపుతున్నామని డబ్బులు వసూలు చేస్తున్నాడు. డబ్బులు వసూళ్లు చేస్తుండగా ఆ ప్రాంతంలో గడివేములకు చెందిన ఓ కారు డ్రైవర్ గుర్తించి ప్రశ్నించారు. దీంతో ఆ వ్యక్తి అక్కడి నుంచి పరారయ్యాడు. ఆ వీడియో వైరల్‌గా మారింది. ఇప్పటికైనా పోలీసు ఉన్నతాధికారులు స్పందించి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న ముఠాపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా వాసులు కోరుతున్నారు.



రాజమండ్రిలో విరాళాలు సేకరిస్తూ పట్టుబడిన నిందితులు



మల్కాజ్ గిరి జిల్లాలో ఆదర్శ వెల్ఫేర్ ఎడ్యుకేషన్ సొసైటీ ఓల్డ్ ఏజ్ హోం పేరుతో ఉన్న రసీదు

5న గరికపాటి ప్రవచనం

కర్నూలు కల్చరల్: భగవాన్ శ్రీ సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 5వ తేదీ ప్రత్యేక ప్రవచనం ఏర్పాటు చేసినట్లు శ్రీసత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తెలిపారు. నెహ్రూనగర్‌లోని శ్రీ సత్యసాయి కళాక్షేత్రంలో సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు 'శ్రీమద్ రామాయణం' అనే అంశంపై మహా సహస్రావధాని పద్మశ్రీ డాక్టర్ గరిక పాటి నరసింహరావు ప్రవచనం చెబుతారని పేర్కొన్నారు.

ఇక ప్రకృతి వ్యవసాయంపై పర్యవేక్షణ

కర్నూలు(అగ్రికల్చర్): ప్రకృతి వ్యవసాయాన్ని పర్యవేక్షించడం, సమీక్షలు నిర్వహించే అధికారాన్ని ప్రభుత్వం వ్యవసాయ యంత్రాంగానికి ఇచ్చింది. ఇప్పటివరకు ప్రకృతి వ్యవసాయంపై వ్యవసాయ అధికారుల పర్యవేక్షణ లేదు. జిల్లా వ్యవసాయ అధికారి మాత్రం అడపాదడపా పర్యవేక్షిస్తున్నారు. ప్రకృతి వ్యవసాయం మొత్తం ప్రాజెక్టు మేనేజర్ ఆధ్వర్యంలోనే జరుగుతోంది. ఇకపై ఏఓలు మొదలుకొని ఏడీఏలు, జిల్లా వ్యవసాయ అధికారి వరకు ప్రకృతి వ్యవసాయాన్ని పర్యవేక్షిస్తారు. సమావేశాలు కూడా నిర్వహించి పురోగతిని సమీక్షించే అధికారాలను ఇస్తూ వ్యవసాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వ్యాధుల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

కల్లూరు: వాతావరణ మార్పుల వల్ల వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల అధ్యాపకురాలు (ఎన్ఎస్ఎస్) ప్రొగ్రామ్ ఆఫీసర్ అన్నపూర్ణ అన్నారు. బుధవారం సల్కాపురంలో నర్సింగ్ కళాశాల విద్యార్థినులు వీధుల్లో పర్యటిస్తూ గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, మధుమేహం వ్యాధుల గురించి చార్టుల ద్వారా వివరించారు. ఎండలు తీవ్రంగా ఉన్నాయని వృద్ధులు, చిన్న పిల్లలు బయట తిరగకుండా చూసుకోవాలన్నారు. శరీరంలో నీటి శాతం తగ్గడం ఎక్కువగా పళ్ల రసాలు, మజ్జిగ, పెరుగు వంటి ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు.

– ఎన్ఎస్ఎస్ ప్రత్యేక క్యాంపులో భాగంగా చిన్నటేకూరు సమీపంలోని సీఈఎస్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు చెట్లమల్లాపురంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.

ఇంటి పన్ను తగ్గించాలి

కల్లూరు: పెరిగిన ఇంటి పన్ను తగ్గించాలని సీపీఎం నగర కమిటీ నాయకులు యేసు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 29, 30, 31వ వార్డులలో పర్యటించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లక్ష్మన్న, లాజర్, జయన్న, రాజు, చాంద్ బాష, జమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

ఓబులమ్మ చెరువు సర్వే చేయండి

పాణ్యం: పాణ్యం రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 1638లో 8.09 ఎకరాల భూమిని కొందరు అక్రమంగా సాగు చేసుకుంటున్నారని, ఈ భూమికి సంబంధించి సమగ్ర సర్వే చేసి ఇవ్వాలని తహసీల్దార్‌కు లేఖ రాసినట్లు మైనర్ ఇరిగేషన్ డీఈఈ నాగన్న బుధవారం తెలిపారు. ఇటీవల ప్రజా సంఘాల నాయకులు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారని, ఈ మేరకు క్షేత్ర స్థాయిలో పర్యటించి రికార్డులను పరిశీలించామన్నారు. తాము పరిశీలించిన రికార్డులను రెవెన్యూ శాఖకు హద్దులు ఏర్పాటు చేయాలని, తమ పరిధిలో ఉంటే తమకు అప్పగించాలని కోరామన్నారు.

డైనింగ్ షెడ్ ప్రారంభం

సి.బెళగల్: ముడుమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన నూతన డైనింగ్ షెడ్‌ను బుధవారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన తిరుమలమ్మ, పవన్‌రెడ్డి, శ్రీనాథరెడ్డి, వరలక్ష్మమ్మ, మేఘనారెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి తదితరుల సహకారంతో పాఠశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేసేందుకు అవసరమైన డైనింగ్ షెడ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సింగల్‌విండో మాజీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, పాఠశాల టీచర్లు గోవిందు నాయక్, వెంకటేశ్వర్లు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

29 వరకు క్లియరెన్స్ సేల్

కర్నూలు(అగ్రికల్చర్): తెలుగు సంవత్సరాది ఉగాది, రంజాన్ పండుగల నేపథ్యంలో కొండారెడ్డిబురుజు సమీపంలోని లేపాక్షి హ్యాండీక్రాఫ్ట్ ఎంపోరియంలో యాన్యువల్ క్లియరెన్స్ సేల్ కార్యక్రమం ఈ నెల 29 వరకు కొనసాగుతుందని మేనేజర్ తిమ్మయ్య తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి క్లియరెన్స్ సేల్‌కు ఆంధ్రప్రదేశ్ హ్యాండీక్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అనుమతి ఇచ్చిందని ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల వస్తువులపై 10 శాతం, ఎంపిక చేసిన వస్తువులపై 50 శాతం వరకు తగ్గింపు సదుపాయం ఉందని పేర్కొన్నారు. హస్తకళా వస్తువులు, చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి హస్తకళా పరిశ్రమల ప్రగతికి తోడ్పడాలని సూచించారు. ప్రతి రోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అమ్మకాలు జరుగుతాయని వెల్లడించారు. కొండపల్లి, ఏటికొప్పాక, వైట్‌మెటల్ బొమ్మలు, బంజార–క్రోచెట్‌లెస్‌లు, స్టోన్‌వేర్ ఫొటో ఫ్రేములు, రోజ్‌ఉడ్ బొమ్మలు, బ్లాక్ మెటల్ క్రాఫ్ట్స్ తదితర వస్తువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

సేవాభావంతో ముందుకు సాగాలి

కర్నూలు(హాస్పిటల్): నగరంలోని గాయత్రి ఎస్టేట్‌లో ఉన్న గీతాంజలి నర్సింగ్ కళాశాలలో బుధవారం 2020–21 బ్యాచ్ నర్సింగ్ విద్యార్థుల ఫేర్‌వెల్ పార్టీ ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ పెరుగు విజయవర్ధన్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చక్కని నడవడిక, క్రమశిక్షణ, సేవాభావంతో ముందుకు సాగాలన్నారు. కోర్సు పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్‌తో పాటు ఎగ్జిక్యూటివ్ ఫైల్‌ను బహుమతిగా ఇచ్చారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రిన్సిపాళ్లు వసంతకుమారి, అర్చన, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దమ్మా.. చల్లగ చూడమ్మా!



శకునాల పెద్దమ్మను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

గడివేముల: శకునాల గ్రామంలో బుధవారం జరిగిన పాలి దేవర కార్యక్రమంలో భక్తులు తండోప తండాలుగా వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. చల్లంగా.. దీవించమ్మా పెద్దమ్మ..! అంటూ భక్తులు పెద్దమ్మ తల్లిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, ప్రజల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటికి బంధుమిత్రులు పిలిపించి ఘనంగా విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి నంద్యాల, కర్నూలు జిల్లాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎస్వీ మోహన్‌రెడ్డి, కేడీసీసీ మాజీ చైర్ పర్సన్ ఎస్వీ విజయమనోహరి, నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరువెంకటరెడ్డి, పాణ్యం మాజీ జెడ్పీటీసీ సభ్యుడు సూర్యనారాయణరెడ్డి, మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు తప్పనిసరి

కోడుమూరు రూరల్: గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలను నెలనెలా తప్పనిసరిగా చేయాలని జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు వైద్య సిబ్బందిని ఆదేశించారు. బుధవారం లద్దగిరి పీహెచ్‌సీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి వైద్య సేవలపై డాక్టర్ భాస్కర్, వైద్య సిబ్బందిని ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం మాతృత్వ అభియాన్‌లో భాగంగా గర్భిణులకు అవసరమైన పరీక్షలను చేసి వివరాలను మాత శిశు కార్డులో తప్పనిసరిగా పొందు పర్చాలన్నారు. హైరిస్క్ గర్భిణులను ముందస్తుగా ఆస్పత్రులలో చేర్పించాలన్నారు.

- ముడుమలగుర్తి గ్రామాన్ని జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యులు డీపీఎంఓ డాక్టర్ ఉమా, డీపీఓ విజయరాజు బుధవారం సందర్శించి మాతా శిశు సంరక్షణ సేవలను పరిశీలించారు. కార్యక్రమంలో లద్దగిరి పీహెచ్‌సీ సీహెచ్‌ఏ శాంతమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాస్‌యాదవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



లద్దగిరి పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు

ఎన్‌సీడీ సర్వేను వేగవంతం చేయాలి

కర్నూలు (హాస్పిటల్): ఎన్‌సీడీ 3.0 సర్వేను వేగవంతం చేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగప్రసాద్ బాబు ఆదేశించారు. ఆయన బుధవారం కర్నూలు మండలం నిడ్జూరు గ్రామంలో సర్వేను తనిఖీ చేశారు. స్టాఫ్ నర్సు, ఏఎన్ఎం, ఆశాలు కలిపిన బృందం సర్వే పక్కాగా చేపట్టి వివరాలను ఎన్‌సీడీ 3.0 యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ముఖ్యంగా నోరు, రొమ్ము, గర్భాశయ ముఖ ద్వార క్యాన్సర్లతో పాటు బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ పరీక్షల కోసం స్క్రీనింగ్ చేయాలన్నారు. అనుమానిత కేసులను ప్రాథమిక/పట్టణ ఆరోగ్య కేంద్ర మెడికల్ ఆఫీసర్లకు రెఫర్ చేస్తే అవసరమైన చికిత్స అందిస్తారన్నారు. అనంతరం అదే గ్రామంలో నిర్వహిస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు సమయానుసారంగా ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పక ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ నాగమణి దేవి, ఆరోగ్య కార్యకర్త సరస్వతి తదితరులు పాల్గొన్నారు.



వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న డీఐఓ నాగప్రసాద్ బాబు

సారా తయారీ మానుకుంటేనే నవోదయం



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రెహనా బేగం

కర్నూలు: సారా తయారీ మానుకుంటేనే జీవితంలో నవోదయం వస్తుందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ రెహనా బేగం అన్నారు. కర్నూలు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఓర్వకల్లులో నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బుధవారం నాటుసారాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. నాటు సారా తయారీ, అమ్మకం, తాగడం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. సారా తయారీ, విక్రయాలు, రవాణా చేయడం నేరమని హెచ్చరించారు. సారా తయారీ మానుకునేవారికి జీవనాధారం కల్పిస్తామని చెప్పారు. సారా నిర్మూలనపై గ్రామస్తులచే రెవెన్యూ అధికారుల సమక్షంలో ప్రతిజ్ఞ చేయించారు.

పాత నేరస్తులు బైండోవర్...

జీవనాధారం కోసం నాటుసారా తయారీ, రవాణా, విక్రయాలు చేస్తూ పట్టుబడిన పాత నేరస్తులపై బైండోవర్ కేసులు నమోదు చేశారు. చర్యలు ఉల్లంఘించినట్లయితే వీరికి రూ.లక్ష వరకు జరిమానా విధిస్తామని ఎస్ఐ హెచ్చరించారు. ఓర్వకల్లు గ్రామానికి చెందిన ఎస్ఎస్ గంగారాం, ఎస్ఎస్ విజయ్, మీదివేముల గ్రామానికి చెందిన మద్దయ్య, ఓర్వకల్లుకు చెందిన నీలిశికారి సుశీల, ఎస్ఎస్ గాయత్రి, ఎస్ఎస్ శైలు, ఎస్ఎస్ రాజమ్మ, సంతోష్‌నగర్‌కు చెందిన ఎరుకలి విజయ్ తదితరులను బైండోవర్ చేసినట్లు ఎస్ఐ రెహనా బేగం తెలిపారు. సిబ్బంది శేషారెడ్డి, ఈరన్న, రామచంద్రుడు, మధు తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతన్న మండల ప్రత్యేక అధికారి వేణుగోపాల్

కల్లూరు: గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి నివారణ చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి (సెట్కూరు సీఈఓ) వేణుగోపాల్ అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ భవనంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండల ఆయన మాట్లాడుతూ ఎండల రోజు రోజుకు పెరగతుండడంతో గ్రామాల్లో నీటి ఎద్దడి రాకుండా ముందు జాగ్రత్తగా తగ్గిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెద్దటేకూరు, బస్తిపాడు, చెట్లమల్లాపురం లేఅవుట్లలో, సొంత స్థలాలలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నాగశేషాచలరెడ్డి, ఈఓఆర్డీ నాగేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, హౌసింగ్ ఏఈ శ్రీనాథ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గోరంట్ల శ్రీలక్ష్మీ మాధవుడి రథోత్సవం



శ్రీలక్ష్మి మాధవుడి మూలవిరాట్



స్వామి అమ్మవార్ల పల్లకీసేవ నిర్వహిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్లలో వెలసిన శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం స్వామి వారి రథోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖాధికారులు, గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు చేశారు. రథోత్సవ కార్యక్రమాన్ని తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచే గాకా, ఇతర ప్రాంతాల నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివస్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథారోహణం, స్వామి అమ్మవార్ల పల్లకీ సేవా కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు, వేదపండితులు నిర్వహించారు.

తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరు

సి.బెళగల్: మండలంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షకు తొమ్మిది మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో భాగంగా రెండవ రోజు బుధవారం హిందీ పరీక్షను నిర్వహించగా.. కొత్తకోట జెడ్పీ హైస్కూల్లోని పరీక్ష కేంద్రంలో ముగ్గురు, ఏపీ మోడల్ స్కూల్లో ఇద్దరు, సి.బెళగల్ జెడ్పీ హైస్కూల్లో ఒక్కరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో ముగ్గురు చొప్పున మొత్తం 9 మంది విద్యార్థులకు గైర్హాజరు అయ్యారని ఆయా పరీక్ష కేంద్రాల నిర్వహణ అధికారులు వంశీమోహన్, బలరాముడు, రఘురామిరెడ్డి, మల్లయ్య తెలిపారు. ఎస్ఐ తిమ్మారెడ్డి పరీక్ష కేంద్రాల దగ్గర మహిళా కానిస్టేబుళ్లు, పోలీస్ సిబ్బందితో బందోబస్తును నిర్వహించి పర్యవేక్షించారు. అదేవిధంగా ఆయా పరీక్ష కేంద్రాల దగ్గర వైద్య సిబ్బంది విద్యార్థులకు వైద్య సేవలను అందించేందుకు క్యాంప్‌లను నిర్వహించారు.



కొత్తకోట పరీక్ష కేంద్రం దగ్గర విద్యార్థులను తనిఖీ చేస్తున్న టీచర్లు

పాణ్యం : మండలంలో బుధవారం జరిగిన పదో తరగతి పరీక్షకు 25 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఈఓ–2 సుబ్రమణ్యం తెలిపారు. మండలంలో ఆరు పరీక్ష కేంద్రాల్లో మొత్తం 1,179 మంది గాను 1,154 మంది హాజరయ్యారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకే పకడ్బందీ ఏర్పాట్లు చేశామన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాకు సహకరించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా


కర్నూలు(సెంట్రల్): తప్పులు లేని ఓటరు జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా కోరారు. ఆయన బుధవారం కలెక్టరేట్‌లోని తన చాంబరులో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలోనే కాకుండా అంతకుముందు కూడా ఓటరు జాబితా స్వచ్ఛీకరణ, క్లెయిమ్‌లు, అభ్యంతరాల పరిష్కారం, అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పు వంటి అంశాలపై తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. అందులో భాగంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నుంచి ప్రతి నెలా సమావేశం నిర్వహించి సూచనలను తీసుకుంటున్నట్లు చెప్పారు. రాజకీయ అంశాలపై చురుగ్గా ఉండేవారిని పంపాలని పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఎక్కడైనా బీఎల్ఓ పోస్టులు ఖాళీగా ఉంటే భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒక్క బీఎల్ఓకు ప్రతి రాజకీయ పార్టీ ఏజెంట్‌ను నియమించాలని సూచించారు. ట్రాన్స్‌జెండర్ ఓటర్ల సంఖ్య తక్కువగా ఉందని, విభిన్న ప్రతిభావంతులు సంక్షేమ శాఖ వద్ద ట్రాన్స్‌జెండర్ల జాబితాలో వివరాలు సరిపోల్చుకోవాలన్నారు. అంతకుముందు కలెక్టర్ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎన్నికల గోదామును పరిశీలించారు. అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పర్యటనకు ఏర్పాట్లు

కర్నూలు(సెంట్రల్): డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మార్చి 22న కర్నూలు జిల్లా ఓర్వకల్ మండలం పూడిచెర్లకు రానున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. ఆయన బుధవారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్షించారు. రాబోయే జూన్‌లోపు రాష్ట్రవ్యాప్తంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రెండు లక్షల ఫారం పాండ్‌లను నిర్మించాల్సి ఉందన్నారు. పూడిచెర్లలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఫారం పాండ్‌ల నిర్మాణాలకు భూమి చేస్తారని, అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారని, తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. శుక్రవారం సాయంత్రంలోపు అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో వెంకట నారాయణమ్మ, కర్నూలు ఆర్‌డీఓ సందీప్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

కర్నూలు(హాస్పిటల్): లింగ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ సెంటర్లు, వైద్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ హెచ్చరించారు. ఆయన బుధవారం పీసీ అండ్ పీఎన్‌డీటీ సబ్ డిస్ట్రిక్ట్ లెవెల్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. సబ్ డిస్ట్రిక్ట్‌లో ఉండే స్కానింగ్ సెంటర్ల కొత్త రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్‌కు దరఖాస్తు చేసుకున్న వాటిని ప్రోగ్రామ్ అధికారులు తనిఖీ చేసి పత్రాలన్నీ సరిగ్గా ఉన్నాయో లేవో పరిశీలించి జిల్లా స్థాయి కమిటీకి నివేదికలు సమర్పించాలన్నారు. కమిటీ ఆమోదించిన తర్వాత వారికి సర్టిఫికెట్ జారీ చేస్తారని తెలిపారు. స్కానింగ్ కేంద్రాల్లో ఫారం – ఎఫ్ రిపోర్ట్‌లను క్రమం తప్పక పోర్టల్‌లో అప్‌లోడ్ చేయించాలని, అన్ని స్కానింగ్ కేంద్రాల్లో పోస్టర్లు ప్రదర్శించాలని చెప్పారు. అనంతరం జూనియర్ కళాశాలలు, పాఠశాలల్లో ఆడపిల్లల ప్రాముఖ్యత గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కమిటి తీర్మానం చేసింది.



మాట్లాడుతున్న ఆర్‌డీఓ సందీప్‌కుమార్